క్లుప్తంగా

మేలైన పద్ధతులతో నాణ్యమైన విత్తనాలు



రైతులకు పురుగు మందులు పంపిణీ చేస్తున్న కృష్ణారావు

కోటబొమ్మాళి: రైతులు మేలైన పద్ధతులతో నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టవచ్చునని ఆత్మా పీడీ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని గంగరాం గ్రామంలో శ్రీకాకుళం రైతు శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామీణ విత్తనాభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. వేరుశనగ పంటలో విత్తనోత్పత్తి చేయాలంటే రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ తిరుమలరావు, ఏవో గోవిందరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామంలో జాతీయ రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా హెచ్చరిక బోర్డులను పోలీసులు శనివారం ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ కోసం స్థానికులకు ఎస్ఐ ఎస్.చిరంజీవి అవగాహన కల్పించారు.

'సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న జడ్జి రవిశంకర్

కాశీబుగ్గ: ఈనెల 11వ తేదీన పలాస కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.రవిశంకర్ అన్నారు. ఈ మేరకు కోర్టులో పోలీసులు, న్యాయవాదులు, అధికారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ సభ్యులు తాండ్ర మురళి, పిండి వెంకటరావు, మహ్మద్ ఘనీ, రాజరత్నంనాయడు, బీకేఆర్ పట్నాయక్, జీఎంఎస్ అనీల్ రాజు, ఎస్ఐ మధు, కమిషనర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు చేయూత



ఫీజును చెల్లిస్తున్న సొసైటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని నారాయణరావుపేట గ్రామానికి చెందిన జుత్తు రూప అనే మహిళ భర్త కొన్నేళ్ల క్రితం మరణించారు. అలాగే కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కుమారుడు ఇటీవల అకాల మరణం చెందాడు. దీంతో వారి కుటుంబ పోషణ కష్టంగా మారింది. అలాగే కుమార్తె పూజను చదివించడం భారమైంది. ఈ తరుణంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు పూజను చదివించేందుకు ముందుకొచ్చారు. ఆమె చదువుతున్న సాయివినీత్ జూనియర్ కళాశాలలో ఫీజును శనివారం చెల్లించారు. కార్యక్రమంలో సభ్యులు రమేష్, తిరుపతి, ప్రశాంత్, రాహులు, షణ్ముఖరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు ముద్దాడ మృతి



మోహనరావు(ఫైల్)

కోటబొమ్మాళి: పలు పత్రికల్లో సుదీర్ఘకాలం సేవలందించిన సీనియర్ జర్నలిస్టు ముద్దాడ మోహనరావు(60) శనివారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. సంతబొమ్మాళి మండలం అంట్లవరంలో అంత్యక్రియలు జరిగాయి. ఆయనకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతిపై కోటబొమ్మాళి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నౌపడా హరిప్రభాకర్, సభ్యులు సంతాపం తెలియజేశారు.

రోడ్డు నిర్మించాలని వినతి

కంచిలి: మండలంలోని కంచిలి పంచాయతీ పరిధి రైల్వేఫీడర్ నుంచి గొల్లకంచిలి మీదుగా బొగాబెణి గ్రామం వరకు ఉన్నటువంటి ఆర్అండ్‌బీ రహదారి పాడైపోయిందని, అందువలన కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని గొల్లకంచిలి, బొగాబెణి పంచాయతీల ప్రజలు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డితో కలిసి వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో రెండు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యానవనంలా ఉద్దానం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- పలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



నాడు-నేడు పనులను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషితో ఉద్దాన ప్రాంతం ఉద్యానవనంలా మారుతోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని ఉద్దాన ప్రాంతమైన అంబుగాం పంచాయతీ పరిధి పెద్దలింబుగాం, చిన్నలింబుగాం, నోతువార, అంబుగాం బొడ్లూరు గ్రామాల్లో సర్పంచ్ తిరునగరి వెంకాయమ్మ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన సమస్యగా మారిన కిడ్నీవ్యాధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రూ.కోట్ల వ్యయంతో కిడ్నీ వ్యాధి మూలాలు పరిశోధించడానికి పరిశోధన కేంద్రం, ప్రతి ఇంటికీ మంచినీరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శుద్ధజలం ప్రాజెక్టు పూర్తి కావస్తోందని, తిత్లీ నష్ట పరిహారం రెట్టింపు చేసి అందజేశామని తెలియజేశారు. అనంతరం గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

అర్హులకు సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే తెలియజేయాలని సూచించారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, పార్టీ నాయకులు మజ్జి హేమరాజు, మజ్జి వైకుంఠరావు, ముడిముంచి ముకుందరావు, గుజ్జుల కూర్మారావు, రామన్న, సాలీన లక్ష్మీనారాయణ, రామారావు, బతకల చిరంజీవులు, తివ్వయ్య, జోతియా లోకనాథం, బొడ్డు జానకిరావు, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఎంఈవో ఎం.లక్ష్మణరావు, ఏఈలు కణితి కృష్ణారావు, గార రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ అక్రమాలపై ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కంచిలి: మండలంలోని జె.బెల్లుపడ రేషన్ డీలర్ అక్రమాలపై దర్యాప్తు చేసి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ కార్డుదారులంతా శనివారం ధర్నా చేశారు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్‌ను సకాలంలో ఇవ్వడం లేదని, ప్రజలను మభ్యపెట్టి బ్లాక్ మార్కెట్‌లో రేషన్‌ను అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. సుమారు 100 మంది కార్డుదారులకు రేషన్ ఇవ్వలేదని, చాలా కాలం నుంచి ఇక్కడ ఇదేతంతు జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా సమగ్ర దర్యాప్తు జరిపి, కొలతల్లో అవకతవకలు లేకుండా రేషన్ అందించే విధంగా తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో సర్పంచ్ అయిధం జయరాం, వైస్ సర్పంచ్ దేసెట్టి దాలిబంధు, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై సీఎస్‌డీటీ కూర్మారావు మాట్లాడుతూ ఫిర్యాదుకు సంబంధించి సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని తెలియజేశారు.

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష జరగనున్న ఏపీ ఎంజేపీ పాఠశాల

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఉపకార వేతనం అందజేసేందుకు నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఆదివారం జరగనుంది. టెక్కలి డివిజన్ పరిధిలోని విద్యార్థులకు టెక్కలిలోనే పరీక్షా కేంద్రాలు కేటాయించారు. మొత్తం 12 పరీక్షా కేంద్రాల్లో 2,840 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఏపీఎంజేపీ, మదర్ థెరిస్సా, ఐజేహెచ్ఎస్, ఆర్‌సీఎం, బీఎస్ అండ్ జేఆర్, ఆదర్శ, అమ్మఒడి, అరుణా, రవీంద్రభారతి పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



కంచిలి: కాలనీని పరిశీలిస్తున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు

కంచిలి: వైఎస్సార్, జగనన్న కాలనీల్లో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి సూచించారు. మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి జగనన్న కాలనీ ఆవరణలో లబ్ధిదారులతో కలిసి సర్పంచ్ గణప సింహాచలం అధ్యక్షతన సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ ఆదేశించారు. పెద్దమురహరిపురం సచివాలయం వద్ద జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మాణాలకు ఇచ్చిన గడువు ఇప్పటికే పూర్తయిందని, ఇప్పటికీ ప్రారంభించకుంటే ఎలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొరకల విశ్వనాథం, సచివాలయ కన్వీనర్ జి.రామారావు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించడంలో లబ్ధిదారులు తాత్సారం చేయడం సరికాదని హౌసింగ్ డీఈఈ ఎ.రామకృష్ణ అన్నారు. మండలంలోని డొంకూరు మత్స్యకార గ్రామంలో లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్ బుడ్డ ముఖలింగం, సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

కోటబొమ్మాళి: జగనన్న కాలనీలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తెలియజేశారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా దంత గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పాపినాయుడు, సర్పంచ్ గొండు చాందిని, వార్డు సభ్యులు చల్ల తిరుపతి, వెలమల కుమార్, శవ్వాన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విజయానికి సైనికుల్లా పనిచేయాలి

- పిరియా సాయిరాజ్



మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్

కవిటి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు సమన్వయంతో పనిచేసి పార్టీ ఓటుబ్యాంకు పెంచాలని సూచించారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పేర్కొన్నారు. గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ జల్లు యుగంధర్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు, వైస్ చైర్మన్ వై.నీలయ్య, పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ సాహూ, వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వ్యవసాయ సలహా మండలి మండల కో-ఆర్డినేటర్ దువ్వు కృష్ణారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పి.శేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణారాళో తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులతో ప్రయోజనం



గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

సోంపేట: భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు పొందడం వలన ప్రయోజనం చేకూరుతుందని సోంపేట సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులను శనివారం అందజేశారు. అర్హులైన కార్మికులు తగిన ధ్రువపత్రాలు అందజేసి గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. గుర్తింపు కార్డులు లేనివారికి బీమాతో పాటు, ఇతర ప్రయోజనాలు వర్తించవన్నారు.

తక్షణ సాయం అందజేత



తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని పాత శాసనాం గ్రామానికి చెందిన గుజ్జు భూపతి ఇటీవల మృతి చెందాడు. దీంతో అతనికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను ఆయన కుటుంబ సభ్యులకు ఎంపీపీ బోర పుష్ప చేతులమీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'వైఎస్సార్ కల్యాణ మస్తు'

కంచిలి: అర్హులందరికీ వైఎస్సార్ కల్యాణ మస్తు పథకం వర్తించబడుతుందని మండల వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పి.ఉమారాణి పేర్కొన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో దరఖాస్తులను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో సీపీ పాపారావు, వార్డు మెంబర్ మాస్టీల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోటబొమ్మాళి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు కొత్తపేట విక్టరీ కాలేజీ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీ లక్ష్మణ్, కానిస్టేబుల్ దుర్గారావు, మహిళా పోలీసు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

సోంపేట: మేజర్ పంచాయతీ సోంపేటలో గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాజేష్ విశాఖపట్నం వెళ్లి పింఛన్ అందజేసి ఉదారత చాటుకున్నారు. గ్రామానికి చెందిన లబ్ధిదారు కర్రి సరస్వతి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. దీంతో ఈనెల పింఛన్‌ను ఆస్పత్రికి వెళ్లి ఎస్.రాజేష్ శనివారం అందజేశాడు. వలంటీర్‌ను సచివాలయ సిబ్బంది, సర్పంచ్ నగిరి ప్రభావతి తదితరులు అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సోంపేట: ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సోంపేట, బారువ ఎస్ఐలు ఎస్.బాలరాజు, వి.సత్యనారాయణలు అన్నారు. ఆయా పంచాయతీల్లో ముగ్గురుతో ప్రయాణిస్తున్న వాహనాలను శనివారం పట్టుకొని యువతకు అవగాహన కల్పించారు. మరోసారి ఇలా జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్ఐ ఎస్.చిరంజీవి సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేసిన పలువురు వాహనదారులను శనివారం అదుపులోకి తీసుకున్నారు. వీరికి స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ ఇచ్చారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంతబొమ్మాళి: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- పాల తలగాంలో గడప గడపకూ మన ప్రభుత్వం

సంతబొమ్మాళి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాల తలగాంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి, సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సతీష్, ఎం.అప్పారావు, ఎస్.భీమారావు, పి.రామకష్ణ, అట్టాల అప్పలనాయుడు, ఎన్ని మన్మథరావు, ఉప్పాడ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని దండుగోపాలపురంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గానికి వివిధ సంక్షేమ పథకాలు ద్వారా ఇప్పటివరకు రూ.1,026 కోట్లు అందించామని, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్నామని తెలియజేశారు. నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించి సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, సర్పంచ్ మార్పు అశోక చక్రవర్తి, సర్పంచ్ కె.ఇందిర, మండల సచివాలయాల కన్వీనర్ ఎం.భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సతీష్, ఎస్.భీమారావు, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు, ఎన్ని మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

కోటబొమ్మాళి: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే బాధ్యతను కన్వీనర్లు, గృహ సారథులు తీసుకోవాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పొడుగుపాడులో తిలారు, చిట్టివలస, పెద్దబమ్మిడి, వాంగ్రాడ, నిమ్మాడ, తులసిపేట, శ్రీజగన్నాథపురం, జర్జంగి, రేగులపాడు, సోదాంకు చెందిన సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాదాన మురళీధర్, వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ రంజాన్‌రాజు, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, కాళ్ల సంజీవరావు, సుంకరి జనార్ధన, తర్ర కామినాయుడు, జి.కేశవరావు, బగాది దివాకర్, ఆవల సత్యం, ఎస్వీ రమణ, జీరు రామారావు, బలగ సూర్యరావు, మెజ్జాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- శారదాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని మాకన్నపురం సచివాలయం పరిధి శారదాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, బూత్ కమిటీ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, పార్టీ నాయకులు పొడుగు కామేష్, బతకల సతీష్, నర్తు తులసయ్య, బీన ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గ్రామాల అభివృద్ధికి కృషి



నీటి సరఫరా పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషి చేస్తోందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని బారువ మేజర్ పంచాయతీలో తాగునీటి సరఫరా పథకాన్ని సర్పంచ్ యర్ర రజనీతో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం సుంకిడి పంచాయతీ కొరంజిభద్ర గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీను, బూత్ కమిటీ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, ఎంపీటీసీ తామాడ పద్మావతి, సుంకిడి సర్పంచ్ శిలగాన భాస్కరరావు, బతకల మోహనరావు, వినోద్ చంద్ర పండ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

కంచిలి: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇచ్ఛాపురం చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ జాస్మిన్ కుమారి అన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల రెసిడెన్సియల్ పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.రమణ అధ్యక్షతన శనివారం అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు గురవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. బాల్య వివాహాలను రూపుమాపాల్సిన అవసరం ఉందని సచివాలయ మహిళా పోలీసు రమ్య పేర్కొన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు. సమావేశంలో చైల్డ్‌లైన్ సిబ్బంది లోకనాథం, కృష్ణబాబు, ప్రసాద్ , ఝాన్సీ, సచివాలయం-2 మహిళా పోలీస్ రూపమేరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పురాణం నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్జునాపురం అంగన్‌వాడీ సహాయకురాలు(ఎస్టీ), కొత్తవరక అంగన్‌వాడీ సహాయకురాలు(ఓసీ), బసవ కొత్తూరు అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ-ఈడబ్ల్యూఎస్), బల్లిపుట్టుగ-1 అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ-హెచ్‌హెచ్), జన్నాగాయి అంగన్‌వాడీ కార్యకర్త(ఎస్టీ) పోస్టులను రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రూరల్ ఐసీడీఎస్ కేంద్రానికి అందజేయాలని కోరారు.

ఇచ్ఛాపురం: అర్బన్ పరిధి లాలాపేట అంగన్‌వాడీ కేంద్రంలోని అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

కోటబొమ్మాళి: మండలంలో ఖాళీగా ఉన్న హరిశ్చంద్రపురం-2 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు (బీసీ-డీ), కోటబొమ్మాళి-2 ప్రకాష్‌నగర్ కాలనీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ) కేటగిరీల్లో పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవో వై.లావణ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి పాసైన స్థానిక మహిళలు ఈనెల 11లోగా కోటబొమ్మాళి అంగన్‌వాడీ ప్రాజక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

మందస: ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు పరిధిలో ఉన్న సోంపేట, మందస మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో కె.వసుంధరాదేవి తెలియజేశారు. మందస మండలంలోని బుడారిసింగిలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు, లొహరిబంద, దేవుపురం, సోంపేట మండలంలోని చిన్నగొల్లగండి, జె.సోంపేట-4, ఇసకలపాలేం, జె.సోంపేట-5, పలాసపురం-2ల్లో హెల్పర్ల పోస్టులకు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను మందస కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'న్యాయం చేయండి'

కాశీబుగ్గ: తనకు అధికారులు న్యాయం చేయాలని సోంపేట మండలం మొగిలికొత్తూరు గ్రామానికి చెందిన మీసాల ఉషారాణి కోరారు. సోంపేట తహసీల్దార్ కార్యాలయంలో తనపై అసభ్యకరంగా ప్రవర్తించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆమె ఆశ్రయించడంతో దిశ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు విచారణ నిమిత్తం పలాస జూనియర్ సివిల్ కోర్టుకు శనివారం హాజరయ్యింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దళిత కుటుంబానికి చెందిన తనపై అసభ్యకరంగా ప్రవర్తించిన అధికారిపై చర్యలు చేపట్టాలని కోరారు. రాజీ అవ్వాలని పలువురు కోరుతున్నారని, అయితే తనలాగే ఎవరికీ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సదరు అధికారి ఫోన్ రికార్డులు కోర్టుకు సమర్పిస్తానని వెల్లడించారు.

విశ్వనాథ్ మృతి తీరని లోటు

టెక్కలి: కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతి సినీ లోకానికి తీరని లోటని టెక్కలి సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ అన్నారు. దిగ్గజ దర్శకుడు మృతిపై థియేటర్ ఆవరణలో శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడికి సైతం అర్థమయ్యే రీతిలో సందేశాత్మక చిత్రాలను తీసిన విశ్వనాథ్ మృతి ఎంతో బాధాకరమన్నారు.